క్లుప్తంగా

రక్షిత నీరు అందించడమే లక్ష్యం



బి.సావరంలో తాగునీటి ట్యాంకు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు మంజూరు చేసిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం బి.సావరంలో రూ.33 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న రక్షిత తాగునీటి ట్యాంకు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సర్పంచ్ కడియం రమాదేవి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ శివారు గ్రామాలకు రక్షిత తాగునీరు అందించేందుకు పైపు లైన్లు, వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపట్టామన్నారు. రానున్న వేసవికి తాగునీటి ఎద్దడి నివారణకు పూర్తి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, పార్టీ నాయకులు బత్తుల లక్ష్మణ్, కంచి వెంకటరమణ, కడియం పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికార భవనం ప్రారంభం



కుట్టుమెషీన్లు అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: పాశర్లపూడిలో క్రాస్ మిషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన మహిళా సాధికారత భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రారంభించారు. అదే సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుశిక్షణ, బ్యుటీషియన్, కంప్యూటర్ శిక్షణను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. క్రాస్ మిషన్ డైరెక్టర్ ఉండ్రు మోజెస్, ఉండ్రు మోహనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో 10 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మెషీన్లు అందించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ మూడేళ్ల నుంచి క్రాస్ మిషన్ ఎంతో మంది పేదలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తూ వారికి జీవనోపాధి కల్పిస్తుందన్నారు. క్రాస్ మిషన్ సంస్థ అందిస్తున్న సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, ఎంపీటీసీ అంకాని వీరాంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ యూవీవీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నీతిపూడి గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయ్యాజీవేమా

పి.గన్నవరం: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం అన్ని విధాలా అభివృద్ధి చెందిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా శుక్రవారం ఊడిమూడిలో సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేమా మాట్లాడారు. ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ఆదిమూలం సూరయ్యకాపు, బీజేపీ రాష్ట్ర నాయకుడు చీకరమెల్లి శ్రీనివాస్, నాయకులు తిక్కా సత్య నారాయణ, గణపతి, అడ్డాల వెంకటేశ్వర రావు, కొల్లి రాంబాబు, సూర్యారావు, చెల్లింగి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్రిమికీటకాల నిర్మూలనతోనే సంపూర్ణ పారిశుధ్యం

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించి క్రిమి కీటకాలను నిర్మూలించడం ద్వారా సంపూర్ణ పారిశుధ్యం సాధ్యమవుతుందని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.మల్లికార్జున, డి.సువర్చలాదేవి, డి.సాయికిషోర్ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరిచిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమికీటకాలు దరిచేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్ పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

ధనుర్మాసోత్సవాలు ప్రారంభం

- మొదలైన సంక్రాంతి శోభ
- ఆకట్టుకోనున్న రంగుల రంగవల్లులు
- తెలుగు సంప్రదాయాలకు ప్రతీక

ఆలమూరు: తెలుగు సంస్కృతికి, సనాతన సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండగకు పల్లెలు ముస్తాబవుతున్నాయి. మార్గశిర శుక్ల పంచమి రోజైన శుక్రవారం అర్ధరాత్రి 12.31 గంటలకు సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించడంతో శ్రీమహా విష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైన ధనుర్మాసం ప్రారంభమైంది. దీంతో సామాన్య ప్రజానీకం గ్రామీణ ప్రాంతాల్లో ఈ ధనుర్మాసాన్ని నెల పట్టుట అని పిలుచుకుంటారు. నేటి నుంచి వచ్చే జనవరి 15న నిర్వహించే మకర సంక్రాంతి వరకూ నెలరోజుల పాటు ఈ ధనుర్మాసం ఉంటుంది. దీనివల్ల పల్లెసీమల్లో భక్తిభావం మరింత పెరిగి అంతటా ఆధ్యాత్మికత తాండవించనుంది. దీంతో వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాస పూజలు చేసేందుకు దేవదాయశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లాలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న దేవాలయాల్లో దేవతామూర్తులు ప్రతి రోజు పల్లకీలో ఊరేగింపుగా వెళ్లి భక్తుల ఇంటింటికీ వెళ్లి దర్శనమివ్వనున్నారు.

సంప్రదాయ కళల కోలాహలం

ధనుర్మాసం ప్రారంభం కావడంతో సంప్రదాయ కళల కోలాహలం గ్రామీణ ప్రాంతాల అంతటా వ్యాపించనుంది. తెల్లవారుజామున ఇంటి ముంగిట ఆడపడుచులు రంగు రంగుల హరివిల్లులు, హరిదాసు కీర్తనలతో మేలుకొలుపు, సంప్రదాయ పిండివంటలతో లోగిళ్లు కళకళలాడనున్నాయి. అలాగే సంక్రాంతిని పురస్కరించుకుని ముగ్గులు, ఎడ్ల పందాలను నిర్వహించేందుకు నిర్వాహకులు సమయాత్తం అవుతుండటంతో పల్లెలకు మరింత శోభాయమానాన్ని చేకూరుస్తుంది. భోగి పండగను పురస్కరించుకుని చిన్నారులు ఆవు పేడను సేకరించి భోగి పిడకలను తయారు చేసే పనిలో నిమగ్నమవుతున్నారు. ఏడాదికోసారి వచ్చే కొమ్మదాసులు, గంగిరెద్దుల వారు, కోయదాసులు వంటి కళాకారులు గ్రామాల్లో సందడి చేయనున్నారు. సంప్రదాయ కళలుగా భావిస్తున్న కోడిపందాలను పోలీసుల కళ్లుగప్పి ఏ విధంగా నిర్వహించాలనే ఆలోచనలో పందెం రాయుళ్లు ఆశావహంలో ఉన్నారు. ఇప్పటికే పందెం కోళ్లను జీడిపప్పు, బాదంపప్పు వంటి బలవర్ధక పౌష్టికాహారంతో పెంచుతున్నారు.



చింతలూరులో వేంచేసిన శ్రీ, భూదేవి సమేత జనార్దనస్వామి



భోగి పిడకలు తయారు చేస్తున్న చిన్నారులు (ఫైల్)

పాకశాలలుగా పల్లె లోగిళ్లు

సంక్రాంతి నెల ప్రారంభం కావడంతో గ్రామీణ ప్రాంతంలోని ప్రతి లోగిలి పిండివంటల తయారీలో పాకశాలగా మారనుంది. ఇంటికి వచ్చే కొత్త అల్లుళ్లు, బంధువులకు తెలుగు సంప్రదాయ వంటకాలైన సున్నుండలు, కజ్జికాయలు, జంతికలు, పోకుండలు తయారు చేసేందుకు మహిళామణులు ఉవ్విళ్లూరుతున్నారు. ధనుర్మాసం సీజన్‌లో రైతులకు పంట చేతికందండంతో సంక్రాంతిని మరింత ఉత్సాహంగా జరుపుకునేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు.

ధనుర్మాసంలో పూజలు చేస్తే సకల శుభాలు



శ్రీమహా విష్ణువుకు అత్యంత్ర ప్రీతి పాత్రమైన ధనుర్మాసంలో నెల రోజుల పాటు వైష్ణాలయాల్లో పూజలు నిర్వహిస్తే అన్ని దుర్గుణాలు తొలగి సుఖశాంతులు లభిస్తాయి. కోరిన కోర్కెలు నెరవేరి సకల శుభాలు జరిగి ఆయురారోగ్యాలు పొందుతారు. ఈధనుర్మాసానికి పురాణాల్లో చాల విశిష్టత ఉంది.

– ద్విభాష్యం రవికృష్ణ శర్మ, వేద పండితుడు, జొన్నాడ

రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శిగా మోహన్‌రెడ్డి



తేతల మోహన్‌రెడ్డి

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శిగా మొగలికుదురు గ్రామానికి చెందిన తేతల మోహన్‌రెడ్డిని నియమించారు. దీనికి సంబంధించి పార్టీ అధిష్టానం నుంచి తనకు ఆదేశాలు వచ్చాయని మోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రతిపాదనల మేరకు మోహనరెడ్డిని రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. పలువురు పార్టీ నేతలు ఆతడిని అభినందించారు.

ఈవీఎంలపై అవగాహన కల్పించాలి

అంబాజీపేట: ప్రతి గ్రామంలోనూ ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పించి చైతన్య పరచాలని తహసీల్దార్ టి.మంగతాయారు అన్నారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బీఎల్వోలకు ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో ప్రతి పోలింగ్ బూత్ వద్ద ఈవీఎంను ప్రదర్శించి ఓటర్లకు వివరించాలన్నారు. అలాగే ఓటు నమోదు ప్రక్రియను నిర్వహించాలన్నారు.

పార్టీ విజయానికి కృషి చేస్తా..



పితాని నర్సింహారావు

పి.గన్నవరం: మండలంలోని మానేపల్లి గ్రామానికి చెందిన పితాని నర్సింహారావు వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన్ను పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. నర్సింహారావు మాట్లాడుతూ బీసీలందరినీ ఐక్యం చేసి, పార్టీ విజయానికి పాటుపడతానని అన్నారు. తన నియామకానికి కృషి చేసిన మంత్రులకు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్ చంద్రబోస్, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పితాని నియామకంపై పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

మొక్క నాటిన ఐఏఎస్ అధికారి

సఖినేటిపల్లి: మోరిపోడు రివర్‌సైడ్ స్కూల్ ఆవరణలో శుక్రవారం ఏపీ నేషనల్ గ్రీన్ కార్ప్స్ డైరెక్టర్, ఐఏఎస్ పి.ప్రవంతి మొక్క నాటారు. ఏపీ ఎన్‌జీసీ ఆధ్వర్యంలో మన పరిసరాలను, మన భూమిని కాపాడుకుందాం కార్యక్రమంలో భాగంగా ఈ మేరకు ఆమె మొక్కను నాటారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు దీనిపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె శిక్షణ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణకు తోడ్పాడునిచ్చే మొక్కలు పెంపకానికి అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. ఏపీ ఎన్‌జీసీ జిల్లా కో ఆర్డినేటర్ జి.ప్రభావతి, ఎంఈవో–1 డి.కిషోర్ కుమార్, పాఠశాల చైర్మన్ నల్లి డార్విన్, ప్రిన్సిపాల్ వై.కిషోర్‌బాబు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ

సఖినేటిపల్లి: తుపాను కారణంగా దెబ్బతిన్న నారుమడుల స్థానే కొత్తగా మడులు వేసుకునేందుకు శుక్రవారం రైతులకు రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ మేరకు అప్పనరామునిలంక, కేశవదాసుపాలెంలో 80 శాతం రాయితీపై విత్తనాలను ఎంపీపీ వీరా మల్లిబాబు, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ అందజేశారు. మండలంలో 57 ఎకరాల్లో రైతులు దాళ్వా సాగుకు సంబంధించిన వరి నారుమడులను పోసుకున్నారని, తుపాను ప్రభావంతో ఇవన్నీ కొట్టుకు పోయాయని ఏవో పీవీ నరసింహారావు అన్నారు. ఎంపీడీవో బడుగు మంగాదేవి, మండల ఏఎంసీ చైర్మన్ ఇంజేటి శామ్యూల్‌రాజు, మెంబర్ కొల్లాబత్తుల చిట్టిబాబు, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు దివ్వి చిట్టిబాబు, నాయకులు యెనుముల చిట్టిబాబు, వై.సింహాచలం, ఆర్‌బీకే, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారికి కండువా వేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: గడచిన నాలుగున్నరేళ్ల పాలనలో నియోజకవర్గంలో కులాలు, మతాలకు అతీతంగా రాజకీయాలు చేయకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని అందించామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆత్రేయపురం మండలం వెలిచేరు గ్రామానికి చెందిన అద్దంకి ప్రవీణ్, సాలి రాజకుమార్, విప్పర్తి ప్రసాద్, కాలాబత్తుల వీరాస్వామి, అరిగెల రవికుమార్ తదితరులు కుటుంబ సభ్యులు జనసేన నాయకులు వైఎస్సార్ సీపీలోని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మాజీ సర్పంచ్ కునాథరాజు రంగరాజు, న్యాయవాది పెద్దింటి వేణుగోపాల్, కునాథరాజు శ్రీనివాసరాజు, సర్పంచ్ వేముల శ్రీనివాస్, ఎంపీటీసీ వెంకన్నబాబు, మాజీ ఎంపీటీసీ వేముల రామన్న ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. సీఎం జగన్ కుల, మత, పార్టీలకు అతీతంగా అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరారు. ఎవరు ఎన్ని చెప్పినా ప్రజలు మాత్రం సీఎం జగన్ వైపే ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

శ్రీరాములు, పటేల్‌కు ఘన నివాళులు



పొట్టి రాములు, వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: అమరజీవి పొట్టి శ్రీరాములు, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్‌ల వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వారి చిత్రపటాలకు ఘన నివాళులు అర్పించారు. మండలంలోని ఊబలంకలో జరిగిన కార్యక్రమంలో వారి చిత్రపతాలకు పూలమాలలు వేసి జగ్గిరెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీలు మల్లిడి రామిరెడ్డి, కర్రి వీర్రెడ్డి, ఉప సర్పంచ్ కొవ్వూరి దుర్గారెడ్డి, దంగేటి మాణిక్యాలరావు, వర్మ ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాముల త్యాగం ఎనలేనిదని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం పొట్టి శ్రీరాముల వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రం గురించి ఆయన చేసిన త్యాగం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపాలకృష్ణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తూ.. సంక్షేమాన్ని వివరిస్తూ..

రావులపాలెం: ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని వివరిస్తూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఊబలంక సచివాలయం–2 పరిధిలోని వినాయకుడి గుడి ఏరియా, ర్యాలి రోడ్డు, పెద వీధి, హైస్కూల్ ఏరియా, గోపాలస్వామి గుడి ఏరియా తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పర్యటించారు. ప్రతి గడపకూ వెళ్లి వారి ఇంట్లో సీఎం జగన్ ప్రభుత్వంలో అందిన సంక్షేమ పథకాలను వివరించి సమస్యలు ఉంటే చెప్పాలని పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చెప్పినవే కాకుండా చెప్పనివి కూడా చేశామన్నారు. ఏ ప్రభుత్వంలో చేయని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసి ధైర్యంగా ప్రజల ముందుకు వస్తున్నామని జగ్గిరెడ్డి అన్నారు. మరోసారి సీఎంగా జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ కొక్కిరగెడ్డ లక్ష్మి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, మల్లిడి రామిరెడ్డి, ఉప సర్పంచ్ కొవ్వూరి దుర్గారెడ్డి, మేడపాటి శ్రీనివాసరెడ్డి, కొక్కిరగెడ్డ అబ్బులు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, సెక్రటరీ బూసి ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొత్తులన్నీ కొట్టుకుపోవడం ఖాయం



లక్కవరంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: టీడీపీ, జనసేన పొత్తుల ప్రభావం ఏమీ ఉండదని, అవి వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభంజనంలో కొట్టుకుపోవడం ఖాయమని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మండలంలోని లక్కవరంలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే రాపాక పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. వలంటీర్లు, అధికారులు, గృహ సారథులు, కన్వీనర్లతో కలసి ఇంటింటికీ తిరిగి ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలు ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజల్లో ఉండి ప్రజా సంక్షేమం కోసం పరితపించే దేశంలోనే ఏకైక సీఎం జగన్ మాత్రమేనని అన్నారు. అర్హత కలిగిన ప్రతి వ్యక్తికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. ప్రభుత్వ పాలన ప్రజల వద్దకే తీసుకువచ్చారని, అందుకోసమే వలంటీర్ల వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ముదునూరి విష్ణుమూర్తిరాజు, కొడవటి దొరబాబు, ముదునూరి శ్రీనివాసరాజు, చిట్టిరాజు, ఆచంట అబ్బులు, కుసుమ చంద్రశేఖర్, సాకా వెంకటేశ్వరరావు, దారా సత్తిబాబు, యాండ్ర రాంబాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించిన అధికారులు



మామిడికుదురులో అంగన్‌వాడీ భవనం తాళాలు బద్దలు గొడుతున్న ఉద్యోగులు

మామిడికుదురు/ఆలమూరు/అంబాజీపేట/అయినవిల్లి: అంగన్‌వాడీ వర్కర్స్ నిరవధిక సమ్మెతో వారి సేవలకు అంతరాయం కలగకూడదన్న ఉద్దేశంతో అధికారులు శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించారు. మొగలికుదురు, నగరం, మామిడికుదురు, పాశర్లపూడిలంక తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను బద్దలు గొట్టి కేంద్రాల్లో ఉన్న సరుకులను స్వాధీనం చేసుకుని బాలింతలు, గర్భిణులకు అందజేశారు. రెవెన్యూ, పోలీస్, సచివాలయ ఉద్యోగులు, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కుసుమ వనజకుమారి సూచించారు.

ఈదరాడ సిద్ధార్థపేట స్కూల్‌కు జగనన్న గోరుముద్ద ద్వారా మంజూరైన వంట పాత్రలను ఎంపీపీ శుక్రవారం ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ నిర్వాహకులకు అందజేశారు. ఆలమూరులో అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె నేపథ్యంలో నిలిచిపోయిన సేవలను పునరుద్ధరించే వీలుగా శుక్రవారం గ్రామ సచివాలయ సిబ్బంది బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, తహసీల్దార్ ఐపి.శెట్టి, కొత్తపేట సీడీపీఓ కె.శారద ఆదేశాల మేరకు మండలంలోనున్న 76 అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన భవనాల వద్దకు రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. అంబాజీపేటలో అంగన్‌వాడీలు సమ్మె బాట పట్టిన నేపథ్యంలో మూసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను తెరవనీయకుండా టీడీపీ, జనసేన నాయకులు హడావుడి చేస్తూ అడ్డుకున్నారు. ఇరుసుమండలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు కేంద్రాలు తెరిచేందుకు శుక్రవారం ప్రయతించారు. ఈ సమయంలో టీడీపీ, జనసేన నాయకులు కొంత మంది మహిళలతో కలిసి వచ్చి అంగన్‌వాడీ కేంద్రాన్ని తీయవద్దని అధికారులకు అడ్డు చెప్పారు. దాంతో అధికారులు వెనుతిరిగి వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా చిన్నారులకు పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని టీడీపీ, జనసేన నాయకులు అడ్డుకున్న తీరుపై పలువురు విమర్శిస్తున్నారు. అయినవిల్లిలో అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం ఆందోళన చేశారు. తమ డిమాండ్ల కోసం పోరాడుతున్నామన్నారు. కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఎస్సై సురేష్‌కు వినతిపత్రం అందజేశారు.

బాలల భవిష్యత్ మీ చేతుల్లోనే ఉంది



కొత్తపేటలో అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: బాలల భవిష్యత్ మీ చేతుల్లోనే ఉంది.. పౌష్టికాహారానికి దూరమై పిల్లలు మాడిపోకుండా వెంటనే విధుల్లో చేరాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అంగన్‌వాడీ కార్యకర్తలను కోరారు. వివిధ డిమాండ్లతో అంగన్‌వాడీ కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్త ఆందోళన, సమ్మెలో భాగంగా స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో నిరసన చేపట్టారు. శుక్రవారం సాయంత్రం నిరసన శిబిరాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఇతర నియోజకవర్గాల మాటేమో గాని ఈ నియోజకవర్గంలో ప్రభుత్వ లక్ష్యం మేరకు పిల్లలను చూసుకోవడంలో, పౌష్టికాహారం అందించడంలో మీరంతా బాగా పనిచేస్తున్నారని అభినందించారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఇచ్చిన మాటకు కట్టుబడి పథకాలు అమలు చేస్తున్నారన్నారన్నారు. మీ న్యాయమైన డిమాండ్లు మీ తమ్ముడుగా ప్రభుత్వ పెద్దల దృష్టికి, సీఎం జగన్ దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు.

సీఎం సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తారని భరోసా ఇచ్చారు. జగ్గిరెడ్డి వెంట ఎంపీపీ మార్గన గంగాధరరావు, పీఏసీఎస్ పర్సన్ మునునూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ పేపకాయల బ్రహ్మానందం, మోడేకుర్రు వీడీసీ కన్వీనర్ కుడుపూడి వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ ఉన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

అమలాపురం టౌన్: స్థానిక శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమం ఆధ్వర్యంలో పేదలు, దివ్యాంగులు, యాచకులకు ఐదు రోజుల నుంచి దుప్పట్లు పంపిణీ జరుగుతోంది. అమలాపురంతో పాటు అంబాజీపేట, కొత్తపేట పరిసర ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ యోగాశ్రమ గురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. అమలాపురంలో సీఐ టి.కాంత్రికుమార్ చేతుల మీదుగా దివ్యాంగులకు దుప్పట్లు అందజేశారు. ఐదు రోజులుగా సుమారు 500 దుప్పట్లు పంచి పెట్టారు. చలి కాలంలో పేదలకు దుప్పట్లు అందిస్తున్న యోగాశ్రమ గురువు శ్రీనివాస్‌ను సీఐ క్రాంతికుమార్ అభినందించారు.

సంక్షేమ సారథి జగన్

గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్



ఎల్.గన్నవరంలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు



పాశర్లపూడిలంకలో పార్టీ పతాకాన్ని ఎగురవేస్తున్న పార్టీ శ్రేణులు



తొండవరంలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు, స్థానికులు

అంబాజీపేట: సంక్షేమ సారథి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని వైఎస్సార్ సీపీ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు అన్నారు. తొండవరం సచివాలయం వద్ద పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చినబాబు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిజిటల్ బోర్డును ప్రారంభించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వెన్నపు రాంబాబు ఇంటి వద్ద సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, పార్టీ ప్రధాన కార్యదర్శి నాగవరపు నాగరాజు, కోర్లపాటి కోటబాబు పాల్గొన్నారు.

ఎల్.గన్నవరంలో...

పి.గన్నవరం: మండలంలోని ఎల్.గన్నవరం–1 గ్రామ సచివాలయ పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ఇంతవరకూ ప్రభుత్వం రూ.15 కోట్ల మేర ఖర్చు చేసిందని సొసైటీ కమిటీ చైర్మన్ యన్నాబత్తుల ఆనంద్ కుమార్ తెలిపారు. మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. అభివృద్ధి కార్యక్రమాల డిజిటల్ బోర్డును, పార్టీ పతాకాన్ని ఆనంద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మానుకొండ ప్రసాద్, చిట్టాల ఆర్యశ్రీను, పెదపూడి సతీష్, కొల్లి రవికుమార్, నూకపెయ్యి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాశర్లపూడిలంకలో..

మామిడికుదురు: సీఎం జగన్ పాలనలో సంక్షేమ రాజ్యం అమలవుతుందని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, మండల జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం పాశర్లపూడిలంకలో జరిగింది. జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుడిగా భావిస్తున్నారని చెప్పారు. జగన్‌ను ఆరాధ్య దైవంగా కొలుస్తున్నారన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించారు. సమావేశంలో మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ అంకాని వీరాంజనేయులు, ఉప సర్పంచ్ విప్పర్తి రమణ, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బాలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.